

ఒకే రేషన్ షాపు

జిల్లాలోనే మేజర్ గ్రామ పంచాయతీ కరన్‌కోట్‌లో పది వేల జనాభాకు ఒకే రేషన్ షాపు ఉంది. 8లో▸



అభివృద్ధిలో కలిసి రావాలి

పరిగిని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దు తానని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. 1వ వార్డులో బస్తీబాట నిర్వహించారు. 8లో▸



పునాదులకే పరిమితం!

మర్పల్లి మండల పరిధిలో 27 జీపీలు ఉండగా 19 భవనాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 9లో▸

న్యూస్‌రీల్

ఘాటెక్కుతున్న ఉల్లి



పెద్దేముల్: కోయకుండానే ఉల్లి కన్నీళ్లు తెప్పిస్తోంది. వంటింట్లో ఏ కూర వండాలన్నా.. ఉల్లి తప్పనిసరి కావడంతో అది ఎంత ఘాటెక్కినా ఖరీదు చేయక తప్పదు. ప్రస్తుతం టమాటాకు ఏమీ తక్కువ కాదన్నట్లు ఉల్లి, వెల్లుల్లి ధర భగ్గుమంటోంది. రెండు నెలల క్రితం క్వింటాకు రూ.800నుంచి రూ.1,000 పలికగా.. ప్రస్తుతం రూ.2 వేలు దాటి, క్రమంగా టమాటా సరసన చేరుతోంది. టోకున ఇలా ఉండగా.. చిల్లర దుకాణాల్లో కిలో రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. కొత్త ఉల్లి వచ్చే వరకు ధర ఇంకా పెరగొచ్చని వ్యాపారులు చెబుతున్నారు.

రేపటి నుంచి 'గృహలక్ష్మి' అర్జీల పరిశీలన

తాండూరు రూరల్: 'గృహలక్ష్మి' పథకానికి ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సోమవారం నుంచి పరిశీలించనున్నారు. అర్జీ దారుల ఇంటికి వెళ్లి మండల స్థాయి అధికారులు విచారణ చేపట్టనున్నారు. నివాస స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టుకునేందుకు రూ.3 లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆశావహులు క్యూకట్టారు. జిల్లా వ్యాప్తంగా ఎంపీడీఓ కార్యాలయాలకు వెల్లువలా వచ్చి దరఖాస్తులు అందజేశారు. వీటి పరిశీలన కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు ఆరుగురు మండల స్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఒక్కో కమిటీలోని సభ్యులకు ఐదు నుంచి ఆరు గ్రామాలు కేటాయించారు. ఆహార భద్రతకార్డుతో పాటు ఓపెన్ ప్లాట్ ఉన్నవారిని గుర్తించాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చినట్లు అధికారులు చెప్పారు.

15 నుంచి నిరవధిక సమ్మె

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏఎన్‌ఎంల నోటీసు



సమ్మె నోటీసు అందజేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

తాండూరు టౌన్: సమస్యల పరిష్కారం కోసం విడతల వారీగా నిరసనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ నెల 15నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంలు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం ఆస్పత్రి వర్గాలకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు రోజ, వెంకటమ్మ, భారతి, సుమలత, మల్లమ్మ, శ్రీదేవి, రాధ తదితరులు పాల్గొన్నారు.

317 జీఓ బాధితులకు న్యాయం చేయాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతగిరి: జీఓ 317 బాధితులకు వెంటనే న్యాయం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ..వెంటనే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రవీందర్, వినోద్ కుమార్, రాములు, అజయ్ కుమార్, పరమేశ్, శంకర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు.. పెంచాలి జోరు



కరివెన వద్ద పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలకు శంకుస్థాపన చేస్తున్న సీఎం కేసీఆర్ (ఫైల్)

వికారాబాద్: పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు లభించడంతో నిర్మాణానికి అడ్డంకులు తొలగినట్లయింది. దీంతో రైతులు, బీఆర్‌ఎస్ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా సంబరాలు నిర్వహిస్తున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అనుమతులు రావడంతో అధికార పార్టీలో నూతనోత్సాహం కనిపిస్తోంది. ప్రాజెక్టు పూర్తయితే సాగుకు కల్పతరువుగా మారుతుంది.

ఏళ్ల తరబడి ప్రచార అస్త్రంగా..

ప్రతీసారి అన్ని పార్టీలకు పాలమూరు అంశం ప్రచార అస్త్రంగా కొనసాగింది.ఎన్నికల టైమ్‌లో హడావుడి చేయడం,ఆతర్వాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది.పదేళ్ల క్రితం ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించటంతో కొంత కదలిక వచ్చిందని ఈ ప్రాంత ప్రజలు భావించారు.కానీ ఆతర్వాత మళ్లీ మరుగున పడింది. పర్యావరణ అనుమతులు వచ్చిన నేపథ్యంలో తిరిగి కదలిక వచ్చినట్లయింది. పాలమూరు నిర్మాణ విషయంలో ప్రభుత్వం ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా కాళేశ్వరం తరహాలో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఈప్రాంత ప్రజలు కోరుతున్నారు.

విమర్శలు.. ప్రతివిమర్శలు

తెలంగాణ ఆవిర్భావం మొదలు పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లాకు సాగు, తాగు నీరు అందిస్తామని ధీమా వ్యక్తం చేస్తూ వచ్చిన అధికార పార్టీ నేతలు.. అప్పడప్పుడు స్వరం మారుస్తూ వచ్చారు.పాలమూరును పూర్తిచేసి తీరుతామనే విషయం ఓసారి నొక్కి చెబుతూనే.. మరోసారి కాంగ్రెస్,బీజేపీపై విమర్శలు గుప్పించారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చిన బీజేపీ పాలమూరుకు ఎందుకు ఇవ్వ డం లేదని ప్రశ్నిస్తూ చర్చను మరో దారిలోకి తీసుకెళ్లేవారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ నేతలు కేసులు వేస్తూ ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డుతగులుతున్నారనే వారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సైతం పలు సందర్భాల్లో ఇదే వాదనలను తెరపైకి తెచ్చారు. ప్రభుత్వానికి పనులు చేసే ఇష్టంలేక అవాస్తవాలను ప్రచారం చేస్తోందని ప్రతిపక్షాలు తప్పుబట్టేవి. ప్ర స్తుతం ఈ అడ్డంకులన్నీ తొలగడంతో ప్రాజెక్టు పను ల్లో వేగం పెంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రాజెక్టుకు దక్కిన పర్యావరణ అనుమతులు

- నంబరాలు చేసుకుంటున్న రైతులు, బీఆర్‌ఎస్ శ్రేణులు
- నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని అభ్యర్థన
- అందుబాటులోకి వస్తే 3.41 లక్షల ఎకరాలకు సాగునీరు
- 417 గ్రామాలకు చేరనున్న ఎత్తిపోతల నీళ్లు

417 గ్రామాలకు లబ్ధి

జిల్లావ్యాప్తంగా ఉన్న 974 గ్రామాల్లోని 417 గ్రామాలకు పాలమూరు ద్వారా సాగు నీరు అందించేలా ప్రణాళిక రూపొందించారు. 3,41,952 ఎకరాలు తడిసేలా ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా కాల్వల కోసం జిల్లాలో 3,979 హెక్టార్ల పట్టా భూమిని సేకరించాల్సి ఉండగా.. ఇందులో ప్రధాన కాల్వ కోసం 1,878 హెక్టార్లు, బ్రాంచ్ కెనాల్స్ కోసం 2,100 హెక్టార్లు అవసరమని తేల్చారు. కేపీ లక్ష్మీదేవిపల్లిలో రిజర్వాయర్ నిర్మిస్తేనే జిల్లాకు చెందిన పూడూరు, నవాబుపేట, రంగారెడ్డి జిల్లా పరిధిలోని చేవెళ్ల మండలాలకు సాగునీరందించటం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతానికి ఈ ప్రతిపాదనను పక్కనపెట్టి ఉద్దండాపూర్ రిజర్వాయర్ ద్వారా కాల్వలు, టన్నెల్స్ ద్వారా నీటిని తీసుకురావాలని గత ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించింది.

- సాగు, తాగు నీటి అవసరాలను తీర్చేలా మూడు దశల్లో ప్రాజెక్టును నిర్మిస్తున్నారు.
- రూ.52,056 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తుండగా ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని 12.30 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందనుంది.
- వరదలు వచ్చి నీటి అనుకూలత ఉన్న సమయంలో రోజుకు రెండు టీఎంసీల చొప్పున నీటిని లిఫ్ట్ చేసి 120 టీఎంసీల నీటిని ఆయా రిజర్వాయర్లను నింపుతారు.
- మొత్తం 18 ప్యాకేజీల ద్వారా 5 లిఫ్టుల సాయంతో ఆరు పెద్ద రిజర్వాయర్లు నింపి నీరందిస్తారు. మన జిల్లాలోని 3.41 లక్షల ఎకరాలకు సాగు నీరు అందనుంది.
- వికారాబాద్ జిల్లాలో కేవలం కాల్వలు మాత్రమే నిర్మిస్తారు, ఎలాంటి రిజర్వాయర్లు ఉండవని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

కల్తీ కల్లుతో ప్రాణాలు తీస్తున్నారు

- మృతదేహంతో మున్సిపల్ కార్మికుల ధర్నా
- అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణ
- ఎస్‌ఐ హామీతో నిరసన విరమణ



పరిగిలో మృతదేహంతో రోడ్డుపై ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పరిగి: కల్తీ కల్లు తాగడంతోనే మున్సిపల్ కార్మికుడు మృతి చెందాడని ఆరోపిస్తూ తోటి కార్మికులు మృతదేహంతో ధర్నా చేశారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా పరిగిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పరిగిలోని ప్రేమ్ కాలనీకి చెందిన నాగుల రాంచంద్రయ్య(55) మున్సిపల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే శనివారం విధులకు హాజరైన అనంతరం పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఉన్న కల్లు డిపోలో కల్లు తాగాడు. అనంతరం కొద్ది దూరాన మార్కెట్ యార్డులో పడిపోయాడు. గమనించిన చుట్టు పక్కల వారు కార్మికులకు సమాచారం అందించడంతో.. వారు వచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రాంచంద్రయ్య మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో ఆగ్రహించిన మున్సిపల్ కార్మికులు పట్టణంలో కల్తీ కల్లు తీవ్రత ఎక్కువైందని, ఇది తాగడంతోనే రాంచంద్రయ్య చనిపోయాడని ఆరోపిస్తూ మృతదేహంతో రోడ్డుపై బైఠాయించారు. గతంలో కూడా కల్తీ కల్లు తాగి ఇద్దరు మరణించినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కల్తీ కల్లుతో ఎందరి ప్రాణాలు హరిస్తారని నిలదీశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సత్యనారాయణ ఘటన స్థలానికి చేరుకుని, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నా విరమించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

- మంత్రి సబితారెడ్డి



అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి సబితారెడ్డి

కందుకూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ఆచరణలో అమలు చేసి చూపుతున్న గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి కొనియాడారు. మండలంలోని బండమీద గూడూరులో శనివారం అంబేడ్కర్ సంఘం నాయకులు భాస్కర్, పారిజాత, బాబయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలను మంత్రి ఆవిష్కరించారు. మాలగూడూరులో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం సమాజంలో మార్పు తేవడానికి ఎంతో కష్టపడ్డారని, వారి ఆశయాలు ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వంలో నెరవేరుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడంతో పాటు 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. దళితులు ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో దళిత బంధు పథకం తెచ్చారని, రాష్ట్రంలో ఉన్న 17 లక్షల దళిత కుటుంబాలకు పథకం అందిస్తామన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేలా సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, స్థానిక సర్పంచ్ శ్రీలత, ఎంపీటీసీ ఎస్.ఎల్లారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ పాల్గొన్నారు.

కొత్త 'పరీక్ష'

- ఇంటర్‌లో ఇంగ్లిష్ ప్రాక్టికల్స్
- ఈ ఏడాది నుంచే అమలు
- కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచేందుకేనంటున్న అధికారులు
- మొత్తం 20 మార్కులు.. 7 వస్తే పాస్
- మిగిలిన 80 మార్కులకు థియరీ ఎగ్జామ్



వికారాబాద్ అర్బన్: ఇంగ్లిష్ సబ్జెక్టుపై విద్యార్థులకు మరింత పట్టు పెంచేందుకు ఇంటర్ బోర్డు సరికొత్త నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు సైన్స్ సబ్జెక్టులకు మాత్రమే ప్రాక్టికల్స్ ఉండేవి. ఇంటర్ స్థాయిలో సీఈసీ, హెచ్ఈసీ వంటి గ్రూపులు ఎంచుకున్న వారికి ఎలాంటి ప్రాక్టికల్స్ ఉండేవి కావు. కానీ బోర్డు నిర్ణయంతో ఇకనుంచి అన్ని గ్రూపుల వారికీ పరిశోధనాత్మక పరీక్షలు తప్పనిసరి కానున్నాయి. ఇంగ్లిష్ సబ్జెక్టులో ప్రాక్టికల్స్ నిర్వహించడం, రికార్డులు రాయడం వంటి పద్ధతిని ఉస్మానియా యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల్లో ఆరేళ్ల క్రితం నుంచే అమలవుతున్నాయి. ప్రస్తుతం ఇదే పద్ధతిని ఇంటర్ బోర్డు ప్రవేశ పెట్టింది.

ఎంతో కీలకం

పాఠశాల విద్య తర్వాత అత్యంత కీలకమైనది ఇంటర్ ఎడ్యుకేషన్. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇంగ్లిష్‌పై పెద్దగా పట్టు ఉండదు. దీంతో పైచదువులకు వెళ్లినా.. ఉద్యోగాల ఇంటర్వ్యూలకు హాజరైన వెనకబడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు రూరల్ ఏరియాల్లోని విద్యార్థులకు సైతం ఇంగ్లిష్‌లో పట్టు పెంచేలా చూడాలని ఇంటర్ బోర్డు సంకల్పించింది.

ఐదు విభాగాలు

ఇంటర్మీడియెట్ ఇంగ్లిష్‌లో ప్రాక్టికల్స్‌కు 20 మార్కులు కేటాయించారు. మిగిలిన 80 మార్కులకు మాత్రమే థియరీ పరీక్ష నిర్వహిస్తారు. ప్రాక్టికల్‌కు సంబంధించిన 20 మార్కులను ఐదు కేటగిరీలుగా విభజించి, ఒక్కో విభాగానికి నాలుగు మార్కులు కేటాయించారు. ఇందులో కమ్యూనికేటీవ్ ఫంక్షన్‌కు 4 మార్కులు, జస్ట్ ఏ మినిట్‌కు 4, లిజనింగ్ కాంప్రిహెన్షన్‌కు 4, రోల్ ప్లేకు 4 మార్కులతో పాటు రికార్డుకు నాలుగు మార్కులు కేటాయించారు. మొత్తం 20 మార్కుల్లో విద్యార్థి కనీసం 7 మార్కులు సాధించాలి.

ప్రాక్టికల్ మార్కులు ఇలా..

అంశం	విధానం	మార్కులు
లిజనింగ్ కాంప్రిహెన్షన్	రాత	4
జస్ట్ ఏ మినిట్ (జామ్)	మౌఖిక	4
కమ్యూనికేటీవ్ ఫంక్షనింగ్	మౌఖిక	4
పాత్రపోషణ (రోల్ ప్లే)	మౌఖిక	4
ప్రాక్టికల్ రికార్డు	రాత	4

మంచి అవకాశం



ఇప్పటి వరకు ఇంగ్లిష్‌ను థియరీ రూపంలోనే నేర్చుకున్నాం. ఇప్పుడు ప్రాక్టికల్స్ పెట్టడంతో సబ్జెక్టుపై పట్టు పెరిగే అవకాశం ఉంటుంది. ప్రాక్టికల్స్ ఉంటాయనే భయంతో ఇప్పటి నుంచే చదువు ప్రారంభించాం కునే ప్రయత్నం చేస్తున్నాం.

– ఎం.ఆకాశ్, ఇంటర్ విద్యార్థి

భయం పోతోంది



ఈఏడాది నుంచే ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ ఉంటాయని లెక్చరర్లు చెప్పారు. కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. నిత్యం ఒక్కో అంశంపై ఇంగ్లిష్‌లో మాట్లాడిస్తున్నారు. ఇంగ్లిష్‌పై భయం పోతోంది.

– నవనీత, ప్రభుత్వ జూనియర్ కళాశాల

నైపుణ్యం పెరుగుతుంది



ఇంటర్ విద్యార్థులకు ఇంగ్లిష్ సబ్జెక్టులో ప్రాక్టికల్స్ నిర్వహించడం శుభ పరిణామం. దీనిద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందుతుంది. ఈ ఏడాది ఫస్టియర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఉంటాయి.

– ఎస్. శంకర్, డీఐఈఓ

10 రోజులు.. రూ.14,324 కోట్లు

- సర్కార్ ఖజానాకు భారీ ఆదాయాన్నిచ్చిన హెచ్‌ఎండీఏ
- కోకాపేట్ నియో పోలిస్ భూములపై రూ.3,319 కోట్లు
- బుద్వేల్ భూముల ద్వారా రూ.3,625.73 కోట్లు
- ఔటర్‌రింగ్ రోడ్డు లీజు మొత్తం రూ.7,380 కోట్లు
- తాజాగా లీజు మొత్తాన్ని చెల్లించిన ఐఆర్‌బీ
- ఇక ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ పరిధిలోకి ఔటర్

సాక్షి, సిటీబ్యూరో: భూముల అమ్మకాలు, ఔటర్ లీజు రూపంలో ప్రభుత్వానికి పది రోజుల్లో ఏకంగా రూ.14,324 కోట్ల ఆదాయం సమకూరింది. జీఓ 111 రద్దు అనంతరం రియల్ భూమ్ పడిపోయిందనుకుంటున్న తరుణంలో హెచ్‌ఎండీఏ వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో రియల్ ఎస్టేట్ దిగ్గజ సంస్థలు పోటాపోటీగా పాల్గొన్నాయి. దీంతో హెచ్‌ఎండీఏకు భారీఎత్తున ఆదాయం లభించింది. ఈ నెల మొదటి వారంలో కోకాపేట్‌లోని నియోపోలిస్ రెండో దశ భూములకు నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో 45.33 ఎకరాలపై ఏకంగా రూ.3,319.60 కోట్ల ఆదాయం లభించింది. అనూహ్యంగా ఎకరం రూ.100 కోట్లకుపైగా అమ్ముడు కావడం సంచలనంగా మారింది. కోకాపేట్‌లో సగటున ఎకరం రూ.73.23 కోట్ల చొప్పున విక్రయించగా, బుద్వేల్‌లో సగటున ఎకరం రూ.36.25 కోట్ల చొప్పున విక్రయించారు. బుద్వేల్‌లో మొత్తం 100.01 ఎకరాలపై ప్రభుత్వానికి రూ.3,625.73 కోట్లు ఆదాయం లభించింది.

- ఔటర్‌రింగ్ రోడ్డు లీజును దక్కించుకున్న ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థ తాజాగా రూ.7,380 కోట్లను ఏకమొత్తంగా హెచ్‌ఎండీఏకు చెల్లించింది. దీంతో పది రోజుల్లోనే సుమారు రూ.14,324 కోట్లకు పైగా ఆదాయాన్ని హెచ్‌ఎండీఏ సమకూర్చింది. మరోవైపు మోకిల, షాబాద్‌లో విక్రయించిన ప్లాట్లపైనా రియల్ ఎస్టేట్ వర్గాలు, మధ్యతరగతి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ నెలలో మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని మరిన్ని భూములను విక్రయించేందుకు తాజాగా నోటిఫికేషన్ విడుదల చేశారు. వచ్చే నెల రోజుల్లో మరో రూ.వెయ్యి కోట్ల వరకు ఆదాయం లభించే అవకాశం ఉన్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఇక 'ఐఆర్‌బీ' ఔటర్..

హైదరాబాద్ నగరం చుట్టూ మణిహారంలా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఔటర్ రింగ్‌రోడ్డు ఐఆర్‌బీ ఖాతాలో చేరిపోయింది. లీజు ఒప్పందం ప్రకారం రూ.7,380 కోట్లను ఐఆర్‌బీ సంస్థ శుక్రవారం అర్ధరాత్రి హెచ్‌ఎండీఏకు చెల్లించింది. టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (టీఓటీ) పద్ధతిలో ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థ 158 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు లీజును దక్కించుకున్న సంగతి తెలిసిందే. 30 ఏళ్ల పాటు లీజు కొనసాగనుంది. సెప్టెంబరు 24 వరకు టెండర్ మొత్తాన్ని చెల్లించేందుకు గడువు ఉన్నప్పటికీ ఆగస్టులోనే చెల్లించడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో ఇప్పటి వరకు హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలోని హెచ్‌జీసీఎల్ నిర్వహణలో ఉన్న ఔటర్ శుక్రవారం అర్ధరాత్రి నుంచే ఐఆర్‌బీ అనుబంధ ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వే ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహణలోకి వెళ్లినట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు.

- ఆది నుంచీ వివాదాస్పదంగా మారిన ఔటర్ లీజు వ్యవహారంలో అధికారులు చివరి నిమిషం వరకు గోప్యతను పాటించారు.

టెండర్ నిబంధనల మేరకు లీజు మొత్తాన్ని ఒకేసారి చెల్లించాల్సి ఉండడంతో లీజు సొమ్ము చేతికి అందే వరకు బయటికి రాకుండా అధికారులు జాగ్రత్తలు పాటించారు. నానక్‌రాంగూడలోని హెచ్‌జీసీఎల్ కార్యాలయంలో ఎంతో జాగ్రత్తగా లీజు ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో ఇప్పటి వరకు హెచ్‌జీసీఎల్ పక్షాన టోల్ వసూలు చేసిన ఈగిల్ ఇన్‌ఫ్రా నుంచి ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వేకు టోల్ వసూలు నిర్వహణ బదిలీ అయింది.

- 158 కిలోమీటర్ల ఔటర్ మార్గంలో 121కి పైగా టోల్‌గేట్లు ఉన్నాయి. ప్రతి రోజు లక్షకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. కొంతకాలంగా ఔటర్‌పై వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. ప్రతి నెలా సుమారు రూ.550 కోట్ల వరకు టోల్ రూపంలో ఆదాయం వస్తోంది. ఇకనుంచి ఈ మొత్తం ఐఆర్‌బీ ఖాతాలోకి వెళ్లనుంది. మరోవైపు భవిష్యత్తులో వాహనాల సంఖ్య పెరగనున్న దృష్ట్యా టోల్ ఆదాయం కూడా భారీగా పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇక నుంచి ఔటర్ రింగురోడ్డులోని 8 లేన్‌ల నిర్వహణ, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు ఐఆర్‌బీ పరిధిలో ఉంటాయి. ఔటర్‌పై పచ్చదనం, సర్వీస్ రోడ్లు తదితర అంశాలు హెచ్‌జీసీఎల్ పరిధిలో ఉండనున్నాయి.

ఎయిర్‌పోర్ట్ కిటకిట



శంషాబాద్ : పదిహేను రోజులుగా శంషాబాద్ విమానాశ్రయం కిటకిటలాడుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రధానంగా డిపార్చర్ టెర్మినల్ వద్ద ట్రాఫిక్ జామ్ నిత్యకృత్యంగా మారుతోంది. ఉన్నత చదువుల కోసం విదేశాల బాటపడుతున్న విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు పలికేందుకు వచ్చే బంధుగణం, స్నేహితులతో ఇలా కిక్కిరిసిపోతోంది. టెర్మినల్ ప్రాంతం ఇసుకేస్తే రాలనంత జనంతో నిండిపోతోంది.

గ్రూప్‌– 2 వాయిదా వేయాలని నిరసన



వికారాబాద్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

అనంతగిరి: గ్రూప్ 2 పరీక్షను వెంటనే వాయిదా వేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిర్వహిస్తున్న పోటీ పరీక్షల షెడ్యూల్‌తో లక్షలాది మంది అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పునర్నిర్మాణమే అసలైన నివాళి

- గద్దర్ సంస్మరణ సభలో వక్తలు

తుర్కయంజాల్: తెలంగాణ పునర్నిర్మాణం జరిగినప్పుడే గద్దర్‌కు ఘనమైన నివాళి అని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి అన్నారు. పూర్వ హయత్‌నగర్ మండల టీజేఏసీ ఆధ్వర్యంలో తుర్కయంజాల్‌లోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ప్రజాయుద్ధ నౌక గద్దర్ సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గద్దర్ రాసిన 1,200 పాటలను ఇంగ్లిష్‌లోకి తర్జుమా చేయాలని, హైదరాబాద్‌లో గద్దర్ సమాధి, పాటల లైబ్రరీ, మ్యూజియం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 25 ఏళ్ల పాటు వెన్నులో బుల్లెట్ ఉన్నా.. ఆరోగ్య సమస్యలు వేధిస్తున్నా నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ, ఆటపాటలతో అలరించి, వారి గుండెల్లో గద్దర్ స్థానం సంపాదించుకున్నారని అన్నారు. అనంతరం ఉషోదయ కళాబృందం కళాకారులు గద్దర్‌కు పాటలతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో వంగేటి లక్ష్మారెడ్డి, క్యామ మల్లేశ్ పాల్గొనారు.

క్లుప్తంగా

పూర్తిగా రద్దు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్‌ఎంలు

అనంతగిరి: కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని పలువురు సెకండ్ ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వికారాబాద్ జిల్లాలో పని చేస్తున్న ఏఎన్‌ఎంలు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఏళ్ల తరబడి గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందిస్తున్నామని వాపోయారు. కరోనా లాంటి విపత్కరమైన పరిస్థితుల్లో ప్రాణాలను అరచేతలో పట్టుకొని వైద్యం చేశామన్నారు. సీఎం కేసీఆర్ ఇప్పటికైనా తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు లలిత, పాపమ్మ, జయశ్రీ, స్వరూప, రోజా, మాణిక్యమ్మ, సత్యకుమారి, సుజాత, అమృత ,ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు అందజేస్తున్న ఆశావహులు

అనంతగిరి: జిల్లాలో నూతన మద్యం దుకాణాల ఏర్పాటుకు ఇప్పటివరకు 561 దరఖాస్తులు వచ్చాయని జిల్లా ఎక్సైజ్ అధికారి నవీన్ చంద్ర తెలిపారు. జిల్లాలో మొత్తం 59 మద్యం దుకాణాల ఏర్పాటు చేయనుండగా శనివారం 169 దరఖాస్తులు వచ్చాయన్నారు. వికారాబాద్ ఏరియాలో ఇప్పటివరకు 171 దరఖాస్తులు, పరిగి 158, తాండూర్ 104, మోమిన్ పేట్ 82, కొడంగల్ 46 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

ఉపాధి కల్పించడమే లక్ష్యం

బంజారాహిల్స్: ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి సబ్యసాచి ఘోష్ అన్నారు. స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. సెట్విన్ సంస్థ కూడా ఉద్యోగాలు కల్పిస్తోందన్నారు.

పదివేల జనాభా.. ఒకే రేషన్ షాపు

కరన్‌కోట్‌లో 1800 రేషన్ కార్డులు

- ప్రతీ నెల సరుకుల పంపిణీకి ఇబ్బందులు
- కూలీ పనులు మానుకోవాల్సిన పరిస్థితి
- రేషన్ దుకాణాల సంఖ్య పెంచాలని వినతి

తాండూరు రూరల్: వికారాబాద్ జిల్లాలోనే మేజర్ గ్రామ పంచాయతీ కరన్‌కోట్ గ్రామం. ఇక్కడ 10 వేలకు పైగా జనాభా నివాసముంటున్నారు. ఇంత జనాభాకు కేవలం ఒకే రేషన్ దుకాణం ఉండటం గమనార్హం. ప్రతి నెల సరుకులు తీసుకునేందుకు కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ దుకాణాల సంఖ్య పెంచాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. కరన్‌కోట్‌లో ఎక్కువ శాతం ప్రజలు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. అలాగే, గ్రామం చుట్టూ నాపరాతి గనులు ఉండటంతో కొందరు కార్మికులుగా పనులు చేస్తూ జీవిస్తున్నారు.

1800 రేషన్‌కార్డులు..

కరన్‌కోట్‌లో 1800 రేషన్ కార్డులు ఉన్నాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ప్రతి నెల 400 క్వింటాళ్ల రేషన్ బియ్యం కోటా వస్తోంది. నెలలో మొదటి వారం నుంచి లబ్ధిదారులకు రేషన్ సరుకులు సరఫరా చేస్తున్నారు. అయితే, పెద్ద ఎత్తున రేషన్‌కార్డులు ఉండటం వల్ల ప్రతి నెల సరుకులకు వచ్చే లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూలీ పనులు మానేసుకొని కేవలం రేషన్ సరుకుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

వివిధ రాష్ట్రాల ప్రజల నివాసం

ముఖ్యంగా కరన్‌కోట్ గ్రామ శివారులో సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఫ్యాక్టరీ ఉంది.



తాండూరు రూరల్: బియ్యం తీసుకెళ్తున్న లబ్ధిదారులు

ఈ ఫ్యాక్టరీలో వివిధ రాష్ట్రాల కార్మికులు ఫ్యాక్టరీలో పనులు చేస్తున్నారు. దీంతో ఇక్కడే క్వార్టర్స్‌తో పాటు అద్దెగదిల్లో నివాసముంటున్నారు. వారు కూడా ప్రతి నెల రేషన్ సరుకుల కోసం వేచి చూడాల్సి వస్తోందని చెబుతున్నారు. అలాగే. నాపరతి గనుల్లో పని చేసే కూలీలు కూడా కరన్‌కోట్‌లో నివాసం ఉంటూ ఇక్కడే రేషన్ సరుకులు తీసుకుంటున్నారు.

దుకాణాల సంఖ్య పెంచాలి

పదివేల జనాభాకు ఒకే రేషన్ దుకాణం ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నామని రేషన్‌కార్డుదారులు వాపోతున్నారు. కావునా రేషన్ దుకాణాల సంఖ్య పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు. దుకాణాల సంఖ్య పెరిగితే.. త్వరగా సరుకులు తీసుకుంటామని చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి దుకాణాలు పెంచాలని కోరుతున్నారు.



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే, ఇతర నాయకులు

అభివృద్ధిలో అందరు కలిసి రావాలి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: పట్టణాన్ని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని 1వ వార్డు మల్లెమోనిగూడలో బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని సమస్యలను పరిష్కరించి మరింత అభివృద్ధి చేస్తానన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నుంచి అధిక నిధులను తీసుకువచ్చి పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎక్కడ ఏ సమస్యలు ఉన్న వెంటనే పరిష్కరిస్తామన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడానికే బస్తీబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. చెత్తబండి సక్రమంగా రావడం లేదని చెప్పడంతో ప్రతి రోజు చెత్తబండి రావాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వాటిని అర్హులైన వారికి అందేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు మౌలానా, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



మృతుడు కిష్టప్ప (ఫైల్)

పెద్దేముల్: కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ గ్రామానికి చెందిన చాకలి కిష్టప్ప(50) తనకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమితో పాటు, ఇతరుల భూములను కౌలుకు తీసుకొని సాగుచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతె శుక్రవారం కుటుంబ సభ్యులతో గొడవపడి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. అనంతరం కుటుంబీకులకు ఫోన్‌చేసి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు చెప్పాడు. వారు వెంటనే పొలానికి వచ్చి చూడగా.. కిష్టప్ప అపస్మారకస్థితిలో పడున్నట్లు గమనించారు. వెంటనే చికిత్స నిమిత్తం తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే కిష్టప్ప చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. భార్య మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అవినీతి బీఆర్‌ఎస్‌ను అంతమొందించాలి

డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్ రెడ్డి

దోమ: అవినీతి బీఆర్‌ఎస్‌ను అంతమొందించేందుకు ప్రతి కార్యకర్త ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తిరుమల తిరుపతి కల్యాణ మండపంలో ఆయా గ్రామాల కార్యకర్తలు, బూత్ ఎన్‌రోలర్స్‌తో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాల పేరుతో దోచుకుంటున్నారన్నారు. రోజురోజుకు ఎదో ఓ పథకాన్ని తీసుకువస్తూ పేదలతో దరఖాస్తు చేయించుకుంటూ, ఆ పథకాలను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం పేరుతో లక్షల రూపాయాలను అప్పులు తెచ్చి అక్రమ సంపాదనను సమకూర్చుకున్నారని ఆరోపించారు. కార్యకర్తలు అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలంటే కార్యకర్తలు ఇప్పటి నుంచే కష్టపడాలని సూచించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్‌రెడ్డి

ఉపాధ్యక్షుడు రాములునాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంచంద్రారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జిల్లా పంచాయతీ రాజ్ సంఘటన అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతిధిని రమేశ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాదయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు చిన్నయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరినాయక్, ఎంపీటీసీ జంగారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి నర్సింహులు గౌడ్, కార్యదర్శి రాజేశ్, ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, బూత్ ఎన్‌రోలర్స్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ అభ్యర్థులకు సన్మానం

ఇటీవలే విడుదలైన ఎస్‌ఐ ఫలితాల్లో మండలానికి చెందిన ఈరారం శ్రీనివాసులు, రాఘవేందర్, సంతోష్ అనే ముగ్గురు అభ్యర్థులు సెలక్ట్ కావడంపై డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశంలో వారికి శాలువలు వేసి ఘనంగా సన్మానించారు.

మార్కెట్ యార్డులో సీసీరోడ్డు



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ ప్రజలకు అన్ని సౌకర్యాలతో కూడిన వ్యవసాయ మార్కెట్ యార్డును అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ చెప్పారు. శనివారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ దీపతో కలిసి రూ.30లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దశల వారీగా వ్యవసాయ మార్కెట్‌ను ఆధునికీకరించేందుకు కృషి చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. మార్కెట్‌కు ధాన్యం తీసుకువచ్చే వాహనదారులకు సౌకర్యంగా ఉండేందుకే సీసీ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ మేక చంద్రశేఖర్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమోసాలో పురుగులు

అస్వస్థతకు గురైన విద్యార్థినిలు



మోమిన్‌పేటలోని స్వీట్ హౌజ్



సమోసాలో పురుగు

మోమిన్‌పేట: సమోసాలు తిని ఇద్దరు విద్యార్థినిలు అస్వస్థతకు గురైన ఘటన బంటార్వం మండలంలోని కేజీబీవీ పాఠశాలలో చోటు చేసుకుంది.. వివరాల ప్రకారం.. మండలంలోని దుర్గంచెరువు గ్రామానికి చెందిన ఎర్రనాగు అంజయ్యకు ఇద్దరు కూతురులు నాగలక్ష్మి, శ్రీవాణిలు. వారిద్దరు బంటార్వం మండలంలోని కేజీబీవీ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నారు. రెండవ శనివారం కావడంతో కూతుళ్లను కలిసేందుకు బంట్వారం వెళ్తూ మోమిన్‌పేట న్యూ బస్టాండు సమీపంలో ఉన్న న్యూ రాజస్థాన్ స్వీట్ హౌజ్‌లో సమోసాలు తీసుకొని వెళ్లి కుమార్తెలకు ఇచ్చాడు. అవి తిన్న వారు వాంతులు చేసుకున్నారు. దీంతో సమోసాలను పరీక్షించగా అందులో పురుగులు ఉన్నాయి. అస్వస్థతకు గురైన విద్యార్థినిలను ఇంటికి తీసుకువెళ్లాలని కేజీబీవీ ప్రత్యేక అధికారి పేర్కొన్నారు. దీంతో ఎర్రనాగు అంజయ్య కూతుళ్లను మోమిన్‌పేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకెళ్లాడు. స్వీట్ హౌజ్‌లను, బేకరీలను అధికారులు తనిఖీలు చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరోగ్యపరంగా ఎంతో కీలకంగా ఉండే ఆహార పదార్థాలపై ప్రభుత్వ అధికారులు పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆర్థిక సహాయం అందజేత

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ పబ్లిక్ వాయిస్ ఫోరం ఆధ్వర్యంలో ములుగు జిల్లా ముంపు ప్రాంత ప్రజలకు వస్తు, నగదు రూపేనా ఎమ్మెల్యే సీతక్క సమక్షంలో పంపిణీ చేసినట్లు ఫోరం జిల్లా అధ్యక్షుడు అశోక్ తెలిపారు. ముంపు బాధితుల కోసం సేకరించిన రూ. 1,24,974లను ములుగు జిల్లాలోని గోవిందరావుపేట మండలంలోని క్లపల్లో చంద్రు తండా, ప్రాజెక్టు నగర్ గ్రామాల ప్రజలకు అందించినట్లు తెలిపారు. ఈ సహాయనిధిని స్వయంగా సీతక్క చేతుల మీదుగా బాధితులకు అందించినట్లు తెలిపారు. సందర్భంగా మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను సీతక్కకు తెలుపుతూ వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పబ్లిక్ వాయిస్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం .వేణు, ట్రెజరరీ అరుణ్ ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే సీతక్కతో కలిసి నిత్యావసరాలు అందజేస్తున్న సభ్యులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి గ్రీన్ సిగ్నల్ రావడంతో శనివారం వికారాబాద్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డితో వికారాబాద్ ప్రజల దశాబ్దాల కళ నెరవేరనుందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ముద్దదీప భక్తవత్సలం, వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, పీఎసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కమాల్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కల్తీకారం పొడి తయారీదారుడు అరెస్టు

రెండు క్వింటాళ్ల కల్తీకారం పొడి సీజ్

తాండూరు టౌన్: కల్తీకారం తయారు చేసి దుకాణాలకు సరఫరా చేస్తున్న వ్యక్తితో పాటు విక్రయిస్తున్న దుకాణ యజమానిని తాండూరు పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన లక్ష్మికాంత్ రావులపల్లిలో కిరాణ దుకాణం నడిపిస్తున్నాడు. తాండూరులో తయారైన కల్తీకారం పొడిని తన దుకాణానికి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు శనివారం లక్ష్మికాంత్ తీసుకెళ్తున్న కారంపొడి బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. విషయం ఆరా తీయగా పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్‌కు చెందిన ఏజాజ్ అనే వ్యక్తి కల్తీకారం పొడిని కుళ్లిపోయిన మిర్చిలు, కొన్ని రకాల రసాయనాలను కలిపి తయారు చేసి దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు చెప్పాడు. దీంతో ఏజాజ్ ఇంట్లో సోదా చేయగా రెండు క్వింటాళ్ల కల్తీకారం పొడి సంచులు లభ్యమయ్యాయి. కారంపొడిని సీజ్ చేసి, తయారీదారుడు ఏజాజ్, దుకాణదారు లక్ష్మికాంత్‌లపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. కల్తీ పదార్థాలను తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.



పోలీసుల అదుపులో దుకాణదారుడు

పలు ప్రాంతాల్లో బీడీ టీం సోదాలు

పరిగి: పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, కల్వర్టు, మార్కెట్ యార్డు, చర్చి, దేవాలయాలు ఆయా ప్రాంతాల్లో సాధారణ తనిఖీలో భాగంగా బీడీ టీం సభ్యులు శనివారం సోదాలు నిర్వహించింది. అనుమానితుల బ్యాగుల్లో చెక్ చేసి ప్రయాణికుల, ప్రజలకు పలు సూచనలు చేశారు. అనుమానితులు ఏమైనా వస్తువులు ఇస్తే వాటిని తీసుకోకూడదని సూచించారు. బస్టాండ్‌ల్లో, ప్రజలు గుమిగూడే ప్రదేశాల్లో ఏదైన వస్తువు పెట్టి వెళ్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బాంబు తదితర వాటిపై ప్రజలు అవగాహన కల్గి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీడీ టీం సభ్యులు పాల్గొన్నారు.



బస్టాండ్‌లో సోదాలు చేస్తున్న బీడీ టీం

హింసకు గురయ్యేది అణగారిన వర్గాలే

సాక్షి సిటీబ్యూరో: కులం, మతం వ్యత్యాసాలతో హింసకు గురయ్యేది అణగారిన వర్గాలేనని జర్మనీ భారత మాజీ రాయబారి వినోద్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో 'స్వతంత్ర భారతంలో కులం-మతం-హింస' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మత కలహాలు సృష్టించే రాజకీయ పార్టీలకు తావివ్వద్దని, ఆజ్యం పోసి లబ్ధి పొందేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తాయని ఆరోపించారు. ఇతర దేశాలకు మన దేశానికి చాలా వ్యత్యాసాలు ఉన్నాయని, అక్కడ పుట్టగానే అందరూ సమానులైతే.. ఇక్కడ మాత్రం అనేక వ్యత్యాసాలుంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. వక్తలు సూరేపల్లి సుజాత, పీఎస్‌ఎన్‌మూర్తి మాట్లాడుతూ మతాన్ని పాజిటివ్‌గా చూడకుండా హింసను ప్రేరేపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ అధ్యక్షత వహించిన సదస్సులో వక్తలు కల్పన. సజయ బిషప్ బాస్కర్, శంకర్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

స్ప్రింట్ డయాగ్నొస్టిక్స్ మొబైల్ యాప్ ప్రారంభం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లోని స్ప్రింట్ డయాగ్నస్టిక్స్‌లో వినియోగదారుల సౌకర్యార్థం సంస్థ రూపొందించిన అధునాతన మొబైల్ యాప్‌ను శనివారం రాష్ట్ర ఐటీ సెక్రటరీ జయేష్ రంజన్ ప్రారంభించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఒకే స్వైప్‌తో స్ప్రింట్ యొక్క మొత్తం సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం అన్నారు. ఆరోగ్య సంరక్షణ రంగం డిజిటల్ పరివర్తన దిశగా వెళ్తున్నదని తమ ప్రభుత్వం డిజిటల్‌సేవలను ఎక్కువగా వినియోగించేలా ప్రోత్సహిస్తున్నదన్నారు. కార్యక్రమంలో మమత వేగుంట, స్ప్రింట్ డయాగ్నస్టిక్స్ సీఎండీ డాక్టర్ అనిల్ కృష్ణ, శరత్‌రెడ్డి, సీవోవో కృష్ణ చైతన్య, పాల్గొన్నారు.

ఆర్ట్ గ్యాలరీలో ది హైదరాబాద్ ఆర్ట్ ఫెస్టివల్ ప్రారంభం

మాదాపూర్: కళాకారులు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కావ్య కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్‌గ్యాలరీలో శనివారం ది హైదరాబాద్ ఆర్ట్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కళాకారులు తమ మదిలోని బావాలను చిత్ర రూపంలో గీయగలరని కొనియాడారు. కళాకారులు వేసిన చిత్రాలకు వందల అర్థాలు దాగి ఉంటాయన్నారు. ఈ ప్రదర్శన ఈనెల 21వ తేదీ వరకు కొనసాగనున్నట్లు క్యూరేటర్ పి.జె స్టాలిన్ తెలిపారు. ప్రదర్శనలో 70 మంది కళాకారులు వేసిన 100 చిత్రాలను ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు కొనసాగనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు రమణారెడ్డి, కళాకారులు సుప్రజారెడ్డి, పద్మప్రియ, శాలిని, ఆశ తదితరులు పాల్గొన్నారు.



ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న కావ్యకిషన్‌రెడ్డి తదితరులు





ఆకట్టుకుంటున్న చిత్రాలు